క్లుప్తంగా

పింఛన్ల పంపిణీ



పందలపాకలో పింఛన్ అందిస్తున్న వలంటీర్

బిక్కవోలు: సామాజిక పింఛన్ల పంపిణీలో భాగంగా తొలిరోజున 81.29 శాతం పింఛన్లను పంపిణీ చేశారు. వలంటీర్లు గురువారం తెల్లవారుజాము నుంచి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేశారు. మండలంలో 10,465 పింఛన్లకు గాను 8,507 పింఛన్లు పంపిణీ చేశారు.

నేడు విద్యుత్ అంతరాయం

సీతానగరం: మిర్తిపాడు, ముగ్గళ్ల విద్యుత్ సబ్ స్టేషన్ వార్షిక మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం పలు గ్రామాలకు విద్యుత్‌ను నిలిపివేస్తామని ఆశాఖ ఏఈ చంద్రమోహన్ తెలిపారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు మిర్తిపాడు, ఉండేశ్వరపురం, బొబ్బిల్లంక, ములకల్లంక, కాటవరం, మునికూడలి, రాజంపేట, వెదుళ్లపల్లి, ఇనుగంటివారిపేట, ముగ్గళ్ల, రఘుదేవపురం, చినకొండేపూడి, సింగవరం పంచాయతీ పరిధిలోని నాగరత్నం కాలనీ, సీతానగరం, కోరుకొండ మండలం మధురపూడి వ్యవసాయ మోటార్ల సర్వీసులకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

రాజానగరం: మల్లంపూడి విద్యుత్ సబ్‌స్టేషను పరిధిలో మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. మల్లంపూడి, తోకాడ, ముక్కినాడ గ్రామాలకు ఆ సమయంలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

వలంటీర్లకు సన్మానం



చక్రద్వారబంధంలో వలంటీర్లకు సన్మానం

రాజానగరం: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సకాలంలో, సక్రమంగా లబ్ధిదారులకు అందజేయడంలో గ్రామ వలంటీర్ల పాత్ర ప్రశంసనీయమని చక్రద్వారబంధం పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుల సమక్షంలో గ్రామ సచివాలయాల పరిధిలో విధులు నిర్వహిస్తున్న వలంటీర్లను గురువారం ఘనంగా సన్మానించారు. వలంటీర్లలో డేగల ఉదయ దుర్గాదేవికి సేవారత్న పురస్కారం లభించింది.

ప్రజల ముంగిటకే సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- ముగ్గళ్లలో గడపగడపకూ..



ముగ్గళ్లలో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ప్రతి సంక్షేమ పథకం అర్హత కలిగిన ప్రజల ముంగిటకు చేరుతోందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. గురువారం మండలంలోని ముగ్గళ్లలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ప్రతి ఇంటి వద్దకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్న తీరును తెలుసుకున్నారు. నాలుగేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో అందించిన లబ్ధిని వివరించారు. రాజమహేంద్రవరం – సీతానగరం రోడ్డు విస్తరణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తెలిపారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే ప్రజల కోరికను సాకారం చేసే దిశగా అడుగులు వేయడం జరిగిందన్నారు.

ముగ్గళ్ల అభివృద్ధికి రూ.3.91 కోట్లు

టీడీపీ హయాంలో ముగ్గళ్ల గ్రామ అభివృద్ధికి కేవలం రూ. 5.70 లక్షలు ఖర్చు చేశారని, వైఎస్సార్ సీపీ నాలుగేళ్ల కాలంలో రూ.3.91 కోట్లు వెచ్చించి గ్రామ సచివాలయం, రైతుభరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేశామన్నారు. నాడు – నేడు పథకం ద్వారా పాఠశాల రూపురేఖలు మారుస్తున్నామన్నారు. గ్రామంలో తాగునీటి సమస్యల పరిష్కారానికి ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం చేపట్టామని, తద్వారా ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, విజిలెన్స్, మానటరింగ్ కమిటీ సభ్యుడు సాదే చంటిబాబు, పార్టీ నాయకులు బొమ్ముల రాంబాబు, సుంకవల్లి సుబ్రహ్మణ్యం, మన్యం నాని, కోనే కోటేశ్వరరావు, కవల కృష్ణమూర్తి, సత్యం రాంపండు పాల్గొన్నారు.

నాలుగేళ్లలో నలభై ఏళ్ల అభివృద్ధి

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- కేక్ కట్ చేసి నాలుగేళ్ల సంబరాలు నిర్వహించిన ఎమ్మెల్యే



పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనలో నాలుగేళ్లలోనే నలభై ఏళ్ల అభివృద్ధి చేశారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారాన్ని చేపట్టి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే కేక్ కట్ చేసి పార్టీ నాయకులు, కార్యకర్తలకు పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్న పథకాలతో నవశకానికి నాంది పలికారని, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అంకితభావంతో నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్వర్ణయుగ పాలన రాష్ట్ర చరిత్ర గతిని మార్చిందన్నారు. రాష్ట్రంలో పరుగులు తీస్తున్న అభివృద్ధి, సంక్షేమాలే దీనికి కొలమానమని చెప్పారు. రాష్ట్రంలో మహిళల ఆర్థిక స్వావలంబన, నిరుపేదల సంక్షేమం, సర్కారు బడుల్లో సంస్కరణ బాటలు వేసేందుకు, అన్నదాతలకు ఆసరాగా నిలిచేందుకు ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తోందని చెప్పారు. ఉచిత పథకాలతో రాష్ట్రం మరో శ్రీలంక అవుతుందన్న చంద్రబాబు టీడీపీ అధికారంలోకి వస్తే ఉచిత పథకాలు అమలుచేస్తామని మేనిఫెస్టో రూపొందించడం విడ్డూరంగా ఉందన్నారు. 2014లో ఇచ్చిన హామీలను నెరవేర్చని చంద్రబాబును, ఆయన అబద్ధపు హామీలను రాష్ట్ర ప్రజలు నమ్మేందుకు సిద్ధంగా లేరని చెప్పారు. అన్ని వర్గాల ప్రజలు 2024 ఎన్నికల్లో తిరిగి వైఎస్సార్‌సీపీకి అధికారాన్ని కట్టబెట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వారా కుమారి, ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, మండల కన్వీనర్లు సత్తి రామకృష్ణారెడ్డి, పోతుల ప్రసాదరెడ్డి, నల్లా శ్రీనివాసరావు, అద్దంకి ముక్తేశ్వరరావు, కొల్లాటి ఇజ్రాయిల్, చిర్ల వీర్రాఘవరెడ్డి, మురళీ మోహన బాలకృష్ణారెడ్డి, కొండేటి భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకే రాజానగరం సీటు

సీతానగరం: జనసేనతో పొత్తుఉన్నా తెలుగుదేశం పార్టీకే రాజానగరం నియోజకవర్గాన్ని కేటాయిస్తారని టీడీపీ బీసీ నాయకుడు బర్ల బాబూరావు అన్నారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. రాజానగరం నియోజకవర్గాన్ని జనసేనకు కేటాయించారని ఆ పార్టీ నాయకుడు బత్తుల బలరామకృష్ణ తప్పుడు ప్రచారం చేసుకుంటున్నారన్నారు. కొత్తగా ఏర్పడిన తూర్పుగోదావరి జిల్లాలో ఏడు నియోజకవర్గాలు ఉన్నాయని, అందులో రాజమహేంద్రవరం రూరల్‌ను జనసేన కందుల దుర్గేష్‌కు కేటాయించారన్నారు. దీంతో రాజానగరంలో జనసేనకు అవకాశం ఉండదన్నారు.

ఆలయాల్లో ఎమ్మెల్యే పూజలు

గోకవరం: మండలంలోని పలు ఆలయాల్లో జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కృష్ణునిపాలెం పంచాయతీ పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో నూతనంగా నిర్మించిన వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే గోకవరం శివారున నూతనంగా నిర్మించిన గ్రామదేవత గంగాలమ్మను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఆలయ కమిటీ సభ్యులు శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఆయన వెంట సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, మండల కన్వీనర్ పాటి రాంబాబు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ కర్రి సూరారెడ్డి, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు గుల్లా ఏడుకొండలు, కృష్ణునిపాలెం సర్పంచ్ రౌతు ఆదిలక్ష్మీ, టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ఆంజనేయుని విగ్రహ ప్రతిష్ఠ

మధురపూడి: కోరుకొండ మండలం పశ్చిమగానుగూడెంలో గురువారం 12 అడుగుల అభయాంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ కమిటీ సభ్యులు రూ.10 లక్షలతో ఆలయాన్ని ఆలయాన్ని నిర్మించడంపై అభినందనలు తెలిపారు.

టైలరింగ్‌లో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

రాజానగరం: ఏపీ స్టేట్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం ప్రాంగణంలోని కామన్ ప్రొడక్షన్ సెంటర్ భవనంలో నిర్వహిస్తున్న స్కిల్ హబ్‌లో మహిళలకు టైలరింగ్‌లో శిక్షణను ప్రారంభించనున్నామని ఆ సంస్థ జిల్లా అధికారి ఎం.కొండలరావు తెలిపారు. ఆసక్తి కలిగిన 18 ఏళ్ల నుంచి 35 ఏళ్లలోపు వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇతర వివరాలకు 83285 07473 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

బాడీ బిల్డర్‌కు ఎమ్మెల్యే అభినందన



అవినాష్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: జాతీయ స్థాయి బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో సత్తా చాటి గోల్డ్ మెడల్స్ సాధించిన నియోజకవర్గంలోని బిక్కవోలు మండలం కొమరిపాలెం గ్రామానికి చెందిన సిరికి అవినాష్‌కుమార్‌ను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అభినందించారు. మే 26, 27 తేదీల్లో కేరళలోని కొచ్చిలో జరిగిన 60 కేజీల జూనియర్స్ విభాగంలో మెన్స్ ఫిజిక్, చాంపియన్ ఆఫ్ ది చాంపియన్ పోటీల్లో విన్నర్‌గా నిలిచి గోల్డ్ మెడల్ సాధించినట్లు కోచ్ భీమేష్ తెలిపారు. దీంతో గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో అవినాష్‌ను ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి దుశ్శాలువా, పూలమాలతో సత్కరించారు. అవినాష్ మరింత ఉన్నత స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు.

కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో మంచినీటి ట్యాంకు ప్రారంభం



ట్యాంక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గోకవరం: ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్టు జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. కృష్ణునిపాలెం పంచాయతీ పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఎంపీ నిధులతో నిర్మించిన 30 వేలు లీటర్ల సామర్థ్యం గల సత్యసాయి వాటర్ ట్యాంక్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి వసతికి ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందన్నారు. ప్రతి గ్రామంలో రక్షిత మంచినీటిని అందించడానికి చర్యలు చేపట్టామన్నారు. సత్యసాయి మంచినీటి ట్యాంక్ నిర్మించడంపై కాలనీ వాసులు ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణునిపాలెం సర్పంచ్ రౌతు ఆదిలక్ష్మి, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాటి రాంబాబు, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ కర్రి సూరారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు గుల్లా ఏడుకొండలు, టౌన్ కన్వీనర్ చింతల అనిల్ కుమార్, నాయకులు రౌతు జోగేశ్వరరావు, నందూరి గంగారావు, బద్దిరెడ్డి అప్పన్నదొర, ప్రసన్న, నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

మగబిడ్డకు జన్మనిచ్చిన మతిస్థిమితం లేని మహిళ



గోకవరం ప్రభుత్వాస్పత్రిలో తల్లీబిడ్డలతో వైద్య సిబ్బంది

గోకవరం: స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ఓ మతిస్థిమితం లేని మహిళ మగ బిడ్డకు జన్మనిచ్చింది. వివరాల ప్రకారం.. బుధవారం రాత్రి మతిస్థిమితం లేని మహిళ పురుటి నొప్పులతో ఆస్పత్రి ఆవరణలో ఏడుస్తూ కనిపించడంతో ఆస్పత్రి స్టాఫ్ నర్సు ప్రశాంతి, స్వీపర్ మిరప పాప ఆమెను గుర్తించి ఆస్పత్రిలో చేర్చారు. తెల్లవారుజామున ఆ మహిళ మగబిడ్డకు జన్మనిచ్చింది. దీనిపై ఆస్పత్రి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ వనజాకుమారి మాట్లాడుతూ తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నారన్నారు. అలాగే ఈ విషయాన్ని ఐసీడీఎస్ అధికారులకు సమాచారం అందించగా సదరు మహిళ దేవీపట్నం మండలం సీతారం గ్రామానికి చెందిన మహిళగా గుర్తించారు. బుధవారం ఆమెను వైద్య పరీక్షల కోసం రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లగా మతిస్థిమితం లేకపోవడంతో అక్కడి నుంచి గోకవరం చేరిందన్నారు. పురుటి నొప్పులతో బాధపడుతున్న మహిళను గుర్తించి పురుడుపోసిన వైద్య సిబ్బందిని వైద్యాధికారి, ఇతర సిబ్బంది అభినందించారు.

తిరుమలకు పాదయాత్ర

రాజానగరం: కాకినాడలోని భోగి గణపతి పీఠం వ్యవస్థాపకుడు దూసర్లపూడి రమణరాజు చేపట్టిన తిరుమల పాదయాత్ర గురువారం సాయంత్రం రాజానగరం చేరుకుంది. సూర్యారావుపేటలో జాతీయ రహదారిని అనుకుని ఉన్న కనకదుర్గ ఆలయంలో పూజలు చేసి, దివాన్‌చెరువు, గామన్ బ్రిడ్జి మీదుగా కొవ్వూరు వైపు పయనమయ్యారు. కాకినాడలో బుధవారం ప్రారంభించిన ఈ పాదయాత్ర ద్వారా 41 రోజులలో తిరుమలకు చేరుకుని, వేంకటేశుని దర్శించుకుంటామని రమణరాజు తెలిపారు.

పర్యావరణ హితంగా జీవనశైలి



పాలచర్లలో పర్యావరణ రక్షణకు ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

రాజానగరం: పర్యావరణానికి హాని కలిగించని విధంగా మన జీవనశైలి ఉండాలని దివాన్ చెరువు సెక్షన్ ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ అధికారి వి.పద్మావతి అన్నారు. పర్యావరణ పరిరక్షణపై చైతన్యం తీసుకువస్తూ 'మిషన్ లైఫ్ ఎన్విరాన్‌మెంట్' కార్యక్రమాన్ని గురువారం పాలచర్లలో నిర్వహించారు. ప్లాస్టిక్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ తోడ్పడాలన్నారు. నీటి సంరక్షణ, ఇంధన పొదుపు, ప్లాస్టిక్ సంచులు, కవర్ల నిషేధం తదితర వాటిని బాధ్యతగా నిర్వర్తించాలన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి పరిసరాలు శుభ్రంగా ఉంటే ఆరోగ్యం కూడా బాగుంటుందని ప్రచారం చేశారు. అనంతరం యువతతో పర్యావరణ పరిరక్షణ మా బాధ్యతంటూ ప్రతిజ్ఞ చేయించారు.

సీతానగరం: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అటవీశాఖ దివాన్ చెరువు సెక్షన్ ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ వి.పద్మావతీదేవి అన్నారు. మిషన్‌లైఫ్ కార్యక్రమంలో భాగంగా గురువారం ఉండేశ్వరపురంలో ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలను వివరించారు. నీటి సంరక్షణ, ఇంధనం పొదుపుపై అవగాహన కల్పించారు. సర్పంచ్ మాకాల ఈశ్వరరావు, ఎంపీటీసీ మట్టా వెంకట రమణ, పంచాయతీ కార్యదర్శి విఠల్, అటవీశాఖ బీట్ ఆఫీసర్ జీవీ రంగారావు పాల్గొన్నారు.

సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

రంగంపేట: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ కె.శ్రీనివాస్ గురువారం తెలిపారు. మండలంలో మొత్తం 605 మంది విద్యార్థులు పరీక్ష రాయబోతున్నారని, పరీక్షల కోసం 13 మంది ఇన్విజిలేటర్లను నియమించినట్లు చెప్పారు.

బిక్కవోలు మండలంలో..

బిక్కవోలు: మండలంలో తొలిసారిగా జరగనున్న టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు ఇన్‌చార్జి ఎంఈఓ కె.శ్రీనివాస్ గురువారం తెలిపారు. మండలంలోని 592 మంది విద్యార్థులు పరీక్ష రాయబోతున్నారని చెప్పారు.

అనపర్తి: ఈ నెల 2 నుంచి ప్రారంభమయ్యే టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ కె.స్వామినాయక్ తెలిపారు. స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో 2, 3, 5, 6, 7, 8 తేదీల్లో జరిగే తెలుగు, హిందీ, ఇంగ్లీషు, మాథ్స్, సైన్స్, సోషల్ పరీక్షలకు మొత్తం 506 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు చెప్పారు. విద్యార్థులను ఉదయం 9.30 లోపు మాత్రమే పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తామని జెడ్పీ బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం కె.సుజాత అన్నారు.

వెంకన్నబాబుకు పరామర్శ

రాజానగరం: మాతృవియోగంతో బాధపడుతున్న మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మండవిల్లి వెంకన్నబాబును ఆ సంఘ ప్రముఖులు గురువారం పరామర్శించారు. వారిలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కంచర్ల బాబీ, జిల్లా వాణిజ్య విభాగం చైర్మన్ బాబులు, ఆర్గనైజింగ్ సెక్రటరీ వారణాసి గుప్తా, సంయుక్త కార్యదర్శి తమ్మన సత్తిబాబు, జోన్ కన్వీనర్ తమ్మన సూరిబాబు ఉన్నారు.

లైంగిక వేధింపులకు పాల్పడినవారిని అరెస్ట్ చేయాలి



కాండ్రేగులలో నిరసన తెలియజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పెదపూడి: మహిళా మల్లయోధులపై లైంగిక వేధింపులకు పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని సీఐటీయూ మండల అధ్యక్షురాలు ఎం.రాజేశ్వరి డిమాండ్ చేశారు. కాండ్రేగుల గ్రామంలో గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు నిరసన కార్యక్రమం నిర్వహించారు. లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషన్ చరణ్‌సింగ్‌ను తక్షణం కఠినంగా శిక్షించాలన్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఆధ్వర్యంలో సమగ్ర విచారణ నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ ప్రతినిధులు వి.భారతి, బి.బాంధవి, ఎన్.నూకపాప, వి.లావణ్య తదితరులు పాల్గొన్నారు.